క్లుప్తంగా

అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న పండితులు,భక్తులు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి జన్మ ఉత్తర నక్షత్రం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నాలుగు గంటల నుంచి స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి వేదపండితులు రమాకాంత్ ఆధ్వర్యంలో పూజలుచేశారు. అయ్యప్ప స్వాములు పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయకమిటీ చైర్మన్ అల్లాడి మురళి, సభ్యులు చింత రాజు, కందుకూరి రవి కొల బాపురెడ్డి, చందు, రాజేశం, రాజ్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు మధు గండయ్య శర్మ, మహిళలు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు ఘన సన్మానం



సన్మానిస్తున్న రెడ్డి సంఘం సభ్యులు

గంభీరావుపేట: జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీగా ఎన్నికైన సందర్భంగా రెడ్డిసంఘం సభ్యులు శుక్రవారం సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులును ఘనంగా సన్మానించారు. గ్రామాభివృద్ధికి కృషిచేస్తూ జాతీయస్థాయిలో అవార్డు అందుకుంటున్నందుకు అభినందనలు తెలిపారు. రెడ్డిసంఘం నాయకులు రాజిరెడ్డి, కమలాకర్ రెడ్డి, సంజీవరెడ్డి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

దశలవారీగా అభివృద్ధి పనులు



భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్

చందుర్తి: దశలవారీగా అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్నట్లు చందుర్తి జెడ్పీటీసీ సభ్యులు నాగం కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లె గ్రామంలో జెడ్పీ నిధులు రూ.లక్షతో హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు శుక్రవారం భూమిపూజ చేశారు. సర్పంచ్ సుమారెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ శ్రీహరిరెడ్డి, వార్డుసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



ట్రోఫీ అందిస్తున్న సర్పంచ్ రమేశ్

బోయినపల్లి: మండలంలోని తడగొండ, బోయినపల్లి గ్రామాల్లో అంబేడ్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో తడగొండ సర్పంచ్ చిందం రమేశ్, ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్ రెడ్డి, పీఈటీ బోయిని సంతోష్ పాల్గొన్నారు.

గుట్టలపై ఒడ్డెరులకు హక్కులు కల్పించాలి

ఎల్లారెడ్డిపేట: జిల్లాలోని అన్ని గుట్టలపై ప్రాంతాల వారీగా ఒడ్డెరులకు అన్నిరకాల హక్కులు కల్పించాలని జిల్లా అధ్యక్షుడు గోగుల రమేశ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గుట్టలపై బండలు కొట్టుకునే హక్కులు లేకపోవడంతో నిరుపేదలైన ఒడ్డెరులకు జీవనోపాధి లేకుండా పోతోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఒడ్డెరుల పిల్లల స్థితిగతులను పరిగణలోకి తీసుకుని ఉపాధికి హక్కులు కల్పించి ఆదుకోవలన్నారు. రాజకీయ రంగాలలో కూడ రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.

బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడి రాజీనామా

ఇల్లంతకుంట: మండలంలోని ముస్కానిపేట బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు సావనపెల్లి శంకర్ గ్రామశాఖ అధ్యక్ష పదవికి, పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. సామాజిక ఉద్యమకారుడు దళితుడైన సావనపెల్లి రాకేశ్ ప్రజా సమస్యలపై ఆమరణ దీక్ష చేసేందుకు సిద్ధం కాగా ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పోలీసులతో అరెస్టు చేయించడంతో దీనిని నిరసిస్తూ శంకర్ తన పదవికి, పార్టీకి రాజీనామ చేస్తున్నట్లు పేర్కొన్నారు.



నివాళులర్పిస్తున్న కమాండెంట్ సుబ్రమణ్యం



చింతాల్‌ఠాణాలో విగ్రహాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు



ఎల్లారెడ్డిపేటలో అంబేడ్కర్ జయంతి వేడుకలు



శాత్రాజుపల్లిలో కేక్ కట్‌చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి



బోయినపల్లి: నివాళి అర్పిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



బీజేపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ

అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం

సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో శుక్రవారం బీఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, ప్రధాన కూడళ్లలో అంబేడ్కర్ చిత్రపటాలకు, విగ్రహాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. భారతదేశానికి డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగిద్దామన్నారు. అనంతరం కేక్‌కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. బీఎస్పీ ఆధ్వర్యంలో పట్టణంలో అంబేడ్కర్ చిత్రపటంతో భారీ ఊరేగింపు, బైక్‌ర్యాలీ నిర్వహించారు.

– సిరిసిల్లటౌన్/సిరిసిల్లఅర్బన్/వేములవాడ/వేములవాడఅర్బన్/వేములవాడరూరల్/ముస్తాబాద్/ఇల్లంతకుంట/తంగళ్లపల్లి/చందుర్తి/వీర్నపల్లి/కోనరావుపేట/బోయినపల్లి/గంభీరావుపేట/రుద్రంగి/ఎల్లారెడ్డిపేట:



కనగర్తిలో విగ్రహానికి పూలమాల వేస్తున్న సర్పంచ్



ఆశిరెడ్డిపల్లెలో కేక్ కట్ చేస్తున్న జెడ్పీటీసీ కుమార్



దెగావత్ తండా జీపీలో నివాళులు అర్పిస్తున్న గ్రామస్తులు



వీర్నపల్లి: తహసీల్దార్ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న డీటీ

తహసీల్ కార్యాలయానికి మోక్షమెప్పుడో?

- రెండేళ్లుగా అద్దె భవనంలోనే..
- అద్దెరూపంలో ప్రజాధనం వృథా
- అన్నిశాఖలకు స్థలం కేటాయించే రెవెన్యూ శాఖకే స్థలం కరువు
- అద్దెభవనంలో పార్కింగ్ స్థలం లేక ప్రజల ఇక్కట్లు



అద్దె భవనంలో కొనసాగుతున్న తంగళ్లపల్లి తహసీల్దార్ కార్యాలయం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి నూతన మండలంగా ఆవిర్భవించి ఆరేళ్లు గడుస్తోంది. అయినప్పటికీ మండలానికి కేటాయించిన తహసీల్దార్ కార్యాలయం ఇప్పటికీ సొంత భవనానికి నోచుకోలేదు. దీంతో వివిధ పనుల నిమిత్తం, రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే మండలప్రజలు అవస్థలుపడుతున్నారు. 'కరవమంటే కప్పకుకోపం వదలమంటే పాముకు కోపం' అనే సామెత చెప్పినట్లుగా ఉన్నతాధికారులకు చెప్పుకోలేక, ప్రజలకు నచ్చజెప్పలేక రెవెన్యూ అధికారులు చేసేదేమిలేక అరకొర వసతులతోనే నెట్టుకొస్తున్నారు. సొంత భవనం ఏర్పాటుచేస్తే అన్ని వసతులు అందుబాటులోకి వస్తాయని ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని మండలంలోని 30 గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అద్దెరూపంలో లక్షల్లో నిధులు వృథా..

తంగళ్లపల్లి నూతన మండలంగా ఏర్పడినప్పటి నుంచి సొంత భవనానికి నోచుకోలేదు.. మొదట తాత్కాలికంగా తంగళ్లపల్లి జీపీ భవనంలో తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటుచేశారు. 6 నెలల్లో సొంత భవనంలోకి వెళ్తుందని అందరూ భావించారు. కానీ నాలుగేళ్లుగా గ్రామపంచాయతీ భవనంలోనే కొనసాగిస్తున్నారు. ఆ తర్వాత రెండేళ్లుగా మానేరు వంతెన సమీపంలోని ఓ ప్రైవేటు భవనంలో అద్దె చెల్లిస్తు కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. అద్దె భవనానికి నెలకు రూ.18వేల చొప్పున చెల్లిస్తున్నారు.ఈక్రమంలో రెండేళ్లలో రూ.4,32,000 ప్రజా ధనం అద్దెరూపంలో వృథాచేశారు, చేస్తూనే ఉన్నారు. సొంత భవనం ఏర్పాటుచేసి ఉంటే ప్రజలకు, అధికారులకు ఇక్కట్లు తప్పేవి.. విలువైన ప్రజాధనం వృథా అయ్యేదికాదని పలువురు విమర్శిస్తున్నారు.

రెవెన్యూశాఖకే భూమి కరువా

అన్ని ప్రభుత్వశాఖల కార్యాలయాలకు, పలు అభివృద్ధి భవనాల నిర్మాణాలకు రెవెన్యూ శాఖ స్థలాలను కేటాయిస్తుంది. అలాంటిది తహసీల్దార్ కార్యాలయం సొంతభవనం నిర్మించేందుకు రెవెన్యూ శాఖకు స్థలం కరువైందా..? అని మండలవాసులు ప్రశ్నిస్తున్నారు. మిగితా మండలాల వారీగా తంగళ్లపల్లి తహసీల్దార్ కార్యాలయానికి కూడా వెంటనే స్థలంతోపాటు నిధులు మంజూరు చేసి సొంత భవనం నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. అద్దె భవనం ప్రధాన రహదారికి ఆనుకుని ఉండడం పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో వివిధపనుల నిమిత్తం వచ్చే ప్రజల వాహనాలు ప్రధానరహదారిపై వరకు పార్కింగ్ చేయాల్సివస్తోంది. దీంతో రోడ్డు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రభుత్వం కళ్లుతెరిచి తహసీల్దార్ కార్యాలయం సొంత భవనం నిర్మాణానికి నడుం బిగించాల్సిన అవసరం ఉంది.

పేరుకే మండల కేంద్రం



తంగళ్లపల్లి మండలం ఏర్పడి ఏడేళ్లవుతోంది. పేరుకే మండల కేంద్రంగా కొనసాగుతోంది. మండలకేంద్రంలో ఉండాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు ఇప్పటికీ అద్దెభవనాల్లో కొనసాగడం సరికాదు. అన్ని కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలి. – బుస్స వేణు, తంగళ్లపల్లి

సొంత భవనం నిర్మించాలి



తంగళ్లపల్లి ప్రజలకు ఇబ్బందులు లేకుండా తహసీల్దార్‌కార్యాలయానికి సొంతభవనం నిర్మించాలి. ప్రభుత్వ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగడం.. అద్దె రూపంలో రూ.లక్షల్లో ప్రజాధనం వృథా చేయడం సరికాదు.

– బైరినేని రాము, ఎంపీటీసీ, చిన్నలింగాపూర్

స్థలానికి ఇబ్బంది లేదు..



తహసీల్దార్ కార్యాలయం సొంత భవనం నిర్మాణానికి స్థలంలేదనడం సరికాదు. రెండుచోట్ల స్థలం సిద్ధంగా ఉంది. భవన నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తాం. నిధుల విషయమై ఉన్నతాధికారులకు నివేదికలు అందిస్తాం.

– పి.సదానందం, తహసీల్దార్ తంగళ్లపల్లి

ఆరోగ్యకేంద్రంలో వసతులు కల్పించాలి



ఆరోగ్యకేంద్రాన్ని పరిశీలిస్తున్న రజిత,వైద్యాధికారి

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు అన్ని వసతులు కల్పించాలని స్థానిక మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ ఒగ్గురజిత డిమాండ్‌చేశారు. ఆరోగ్యకేంద్రాన్ని వైద్య సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఉమ్మడి మండలానికి చెందిన గర్భిణులు, బాలింతలకు ప్రతిరోజు భోజన వసతి కల్పిస్తుండగా ఆరోగ్యకేంద్రంలో వంటగది లేకపోవడంతో స్టోర్‌రూంలో వంటచేసి పెడుతున్నారని పేర్కొన్నారు. శాశ్వత వంటగదిని నిర్మించాలని కోరారు. మూత్రశాలలు సరిగ్గాలేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు ఇన్ పేషంట్లకు వసతులు కల్పించాలని జిల్లా వైద్యాధికారులను కోరారు. వారి వెంట మండల వైద్యాధికారి ప్రదీప్, బాల్‌రాజ్ ఉన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తా



ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిని సన్మానిస్తున్న హన్మండ్లు

గంభీరావుపేట: జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు అన్నారు. నూతనంగా ఎన్నికైన మండల ప్రెస్‌క్లబ్ కార్యవర్గానికి బీసీ సంక్షేమ సంఘం తరపున ఆత్మీయ సన్మానం చేశారు. ఈ సందర్భంగా హన్మండ్లు మాట్లాడుతూ.. మండలకేంద్రంలో ప్రెస్‌భవన్ ఏర్పాటు, జర్నలిస్టులకు ఇళ్లస్థలాల వచ్చేలా చూస్తామన్నారు. వ్యయప్రయాసలకోర్చి విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టుల సేవలు అభినందనీయమన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ప్రెస్‌క్లబ్ పాలకవర్గ సభ్యులను బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీగాధ గణేశ్, బీసీసేన జిల్లా అధ్యక్షుడు బట్టు ప్రవీణ్, బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి రెడ్డబోయిన గోపి, జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, మండల అధ్యక్షుడు గంట అశోక్ పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాలు ఆదర్శం



అంబేడ్కర్, జార్జిరెడ్డిలకు నివాళులు అర్పిస్తున్న టీపీటీఎఫ్, పీడీఎస్‌యూ నాయకులు

సిరిసిల్లటౌన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ విధానం.. విప్లవ వీరుడు జార్జిరెడ్డి కనబరిచిన ఆదర్శ విధానాలు అందరికీ ఆచరణీయమని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సిరిసిల్లలోని శివనగర్ ప్రభుత్వ పాఠశాలలో టీపీటీఎఫ్, పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి, చేగువేరా కామ్రేడ్ జార్జిరెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ... మహనీయులు చూపిన ఆదర్శ విధానాలు మార్గదర్శకమన్నారు. టీపీటీఎఫ్ ప్రధానకార్యదర్శి దుమాల రమానాథ్‌రెడ్డి,వాసుదేవరావు, పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థులు పోకల సాయికుమార్, స్వామిదాస్, అంజుగౌడ్, పీఓడబ్ల్యూ నాయకులరా రాజేశ్వరి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



కోనరావుపేట: మండలంలోని కనగర్తి ఎస్సీకాలనీలో ఇనుప విద్యుత్‌స్తంభం ప్రమాదకరంగా మారింది. దాని స్థానంలో సిమెంట్ పోల్ ఏర్పాటుచేసి కనెక్షన్లు ఇచ్చారు. కానీ ఇనుప స్తంభాన్ని తొలగించడం మర్చిపోయారు. దీంతో ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిన నేతలు



బోయినపల్లి: హైదరాబాద్ వెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



తంగళ్లపల్లి నుంచి హైదరాబాద్ తరలివెళ్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు



ఎల్లారెడ్డిపేట నుంచి వెళ్తున్న నాయకులు



హైదరాబాద్ తరలివెళ్తున్న నాయకులు



వీర్నపల్లి నుంచి తరలివెళ్తున్న నాయకులు

ముస్తాబాద్/తంగళ్లపల్లి/వీర్నపల్లి/ఎలారెడ్డిపేట/బోయినపల్లి: అంబేడ్కర్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్. అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ మహోత్సవానికి ముస్తాబాద్ మండలం నుంచి ఎంపీడీవో రమాదేవి, బోయినపల్లి మండలం నుంచి ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ, వీర్నపల్లి మండలం నుంచి ఎంపీపీ మాలోత్ భూల, జెడ్పీటీసీ గుగులోత్ కళావతి, ఎల్లారెడ్డిపేట మండలం నుంచి జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పిలుపు మేరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, దళిత సంఘాల నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు.

ఆర్థిక సాయం అందజేత

ఇల్లంతకుంట: మండలంలోని వల్లంపట్లకు చెందిన కర్ల సాత్విక అనే యువతి క్యాన్సర్‌తో బాధపడుతుండగా వేములవాడకు చెందిన మన ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం బాధితురాలి కుటుంబానికి ట్రస్టు సభ్యులు ఆర్థిక సాయం అందించారు.